బాధ్యతలకు బాట





బాధ్యతలకు బాట - నూనె సుక్క కథలు

- డా. సిద్దెంకి యాదగిరి 9441244773

జీవితాల్ని కథలుగా వ్యాఖ్యానించడమంటే మరుగున పడిన మానవ సంబంధాల ఎతలను దృశ్యీకరించడమే. నిజజీవితంలోని కనబడని కోణాల్ని, మనసు తడిని, ప్రేమ పదనను, ధర్మాగ్రహ పదునును అక్షరాల్లో అంతరాత్మను కథల్లో ఆవిష్కరించడమే కథనం. నిబద్ధతతో నిజాయితీగా నిలుపడమే కథల అంతిమ లక్ష్యమే కథ. కథల్ని అక్షర శిల్పి, కథకులు కొట్టం రామకృష్ణారెడ్డి. వారి కథలు జీవితాల్లోని అడుగంటిన ప్రేమను పాతాళగరిగేతో దేవి గిడస బారిన మనసుపై కుంభవృష్టిగా ఆర్ద్రతల్ని కురిపిస్తాడు. మానవీయతను బాధ్యతగా హృదయంలోకి వొంపి అనుబంధాలను తిరిగి అంకురింప చేస్తాడు. కథల్లోని జీవితం

మనసుకు అవిటితనం లేని సీతమ్మకు భర్త రామయ్య అంటే మహా ప్రాణం. అతనికి, వ్యవసాయంలో, జీవితంలో అన్ని విధాలుగా తోడుండేది. ఒకనాడు సినిమా హీరో ప్రసేన్ చిత్రపటాన్ని చూసి ముచ్చటపడి కొనుక్కొచ్చి దానిని రహస్యంగా అద్దం వెనుక దాచింది. సీతమ్మ మనసు గ్రహించిన రామయ్య చేసిన పనిని తెలిపే కథ "అద్దం వెనుక" చదివితే నేటి దంపతులకు అపార్థాలు రావని తెలుపుతుంది.

తండ్రి జబ్బుకు మందు తేవాలని కల్మకల్ వెళ్లిన రచయితకు మందు ఇచ్చిన సాకలి బాలయ్య వర్షం వస్తుందనీ, వెళ్ళవద్దని వారించిన వినకుండా బయలుదేరి వస్తుండగా మార్గమధ్యంలో వయసుకు వచ్చిన మనుమరాలుతో ఉంటున్న ముసలమ్మ వద్ద తుంగ గడ్డి గుడిసెలో ఆ రాత్రి ఆశ్రయం పొందుతాడు. తెల్లవారి బయలుదేరిన రచయితకు ఆ మనుమరాలి చూపులు ఎందుకు గుచ్చుకున్నయో, ఆ అనుభవాన్ని తలుచుకొని అమెరికా నుంచి వచ్చిన తర్వాత ఆ ఊరినీ, అక్కడి పరిస్థితుల్ని కళ్లగట్టినట్టుగా హృదయానికి హత్తుకునేటట్టు ఎలా రాశాడో తెలియాలంటే 'ఆఖరికి' కథ చదివితే పాఠకుల్ని మర్చిపోనివ్వదు.

అర్థం వేరు. అంతరార్థం వేరు. వాస్తవాన్ని గుర్తించకపోతే జరిగిన అపార్థమే జనిస్తుంది. ప్రాణానికి ప్రాణంగా ఉన్న తల్లి కొడుకుల మధ్య ఒకరి మొఖం ఒకరు చూడకుండా ప్రేమ లేకుండా చేసిన నూనె సుక్క ఏం చేసింది? తల్లి కొడుకులను ఒక జీవితకాలం ఎందుకు విడదీసింది? నానమ్మ చెప్పిన జీవిత తాత్వికత ఏమిటో తెలియాలంటే 'నూనె సుక్క' కథ చదవాల్సిందే. అపార్థాన్ని తొలగించుకోవాల్సిందే.

విడిచి వెళుతున్నాడని అయోధ్య వాసులు ఒకవైపు విలపిస్తున్నారు. రుతుక్రమాన్ని మరిచి అడవిలోని ఫలాలు ఫలి స్తున్నాయి. ఏది తెచ్చిన కాకి ఎంగిలి అనీ అంటారని ఆయాసం వస్తున్న ఆవాసాన్ని వెతికిన వాయసం. బిచ్చగాడు ఎత్తుకుపోయిన నాటి సీతమ్మను నేడు కనుగొనడానికి జనావాసాల మధ్య, తిరుగుతూ వాయసం ఏం వెతుకుతుందో తెలియాలి అంటే 'కాకి రామమం' చదవాలి. రంగు నలుపు. కానీ కాకి మనసు నల్లగా ఉంటుందా అని ప్రశ్నిస్తుందీ కథ.

ఎండాకాలం తాతిల్ (సెలవులు)అంటే పిల్లలకు తల్లిదండ్రులకూ ఇష్టమే. పిల్లాడిని తీసుకుని లక్ష్మీ మామ ఆడపడుచు దగ్గరికి రుక్కమ్మతో సహా వెళ్లడం వల్ల లక్ష్మీ ఆశ అడియాశ అయింది. వారం తర్వాత వారం రోజులు బిడ్డ అత్తమామను పిలిచి మర్యాద చేసిందు రాములయ్య. వాళ్ల తర్వాత వారం రోజులు బిడ్డ కలమ్మ ఉన్నది. వారిని సాగనంపుతున్న బస్సులోనే లక్ష్మి తండ్రి తీసుకెళ్దామని దిగిండు. తల్లి గారి ఇంటికి వెళ్లే లక్ష్మికి అత్త రుక్కమ్మ ద్వారా నూరు రూపాయలు ఇస్తాడు. తాతీలు దొరకంగానే వద్దామని అనుకున్నాను అని తండ్రితో అంటున్నప్పుడు లక్ష్మికి తన తండ్రి అత్తమామల గురించి ఆర్ద్రంగా చెప్పిన బ్రహ్మ రహస్యం ఏమిటో తెలిస్తే గాని కన్నీళ్లతో అమ్మగారింటికి పోయే కోడల్ని మొట్టమొదటిసారిగా విడ్డూరంగా చూసింద్రు చుట్టుపక్కలోల్లు అని 'తాతిల్' కథను ముగిస్తాడు. అసహజమనిపించినా రచయిత సహజంగా తీర్చిదిద్దాడు.

ప్రకృతిని కాపాడుకోలేని వాడు ప్రపంచాన్ని ఏం బాగు చేస్తాడు ? చేయలేడు. దేవుడే ప్రకృతి ప్రకృతే దేవుడుగా ఆచరించాలని ఆరాధించాలని అలా చేసినప్పుడు మాత్రమే భవిష్యత్తు అభ్యున్నతికి పాటుపడ్డ వాళ్ళమైతామని బోధించే బాధ్యతని మేల్కొల్పే కథ 3456జిబి. ఈ కథ చదివితే ప్రకృతి వినాశనం కాని వద్దని కోరుకున్న వాళ్ళము అవుతాము.

అప్పుడే పుట్టిన కోడె తల్లి మాటలు విని మనిషినై పుట్టనందుకు మురిసిపోయినా కష్టాలు తప్పలేదు. పైసలు ఎదిరిచ్చి కష్టాలు కొనుక్కునే కోడళ్ళ మూర?త్వం మీద, చచ్చిపోయేలా కల్పించిన పరిస్థితుల మీద, జీవితకాలం పనిచేసి అతని అభివృద్ధికి ఆధారమైన ఆ పశువును కసాయి వాడికి అమ్ముతున్నపుడు ఆ పశువు జ్ఞాపకాల ఆత్మఘోషనే 'బలిపసువు' కథ.

ఏ ఆధారం లేకుండా తన చెల్లెల్ని చంపిన వరకట్న పిశాచిపై తీర్చుకున్న పగకు శిక్ష విధించాలనుకున్న జడ్జి ఇవ్వాల్సిన తీర్పే ఇచ్చిన కథ 'తీర్పు'.

చెరపకురా చెడిపోయేదేవు అని బోధించే కథ ఆకుపచ్చటి నెత్తుటి జాడ. శంకర్ రెడ్డిది ఓర్వజాలను మనస్తత్వం. కుమ్మరి మల్లయ్య జాగలోని మామిడి చెట్టు నీడబారుతుందనీ తన మనుషుల చేత కాత ఉండగానే కొట్టేస్తాడు. కుమ్మరి మల్లయ్య పిచ్చివాడై

శాపనార్థాలు పెట్టినందుకు రక్తం గారేటట్లు కొడతే చెట్టు మొదట్లోని తల్లి సమాధిపై పడతాడు. ప్రాణానికి ప్రాణంగా ప్రేమించే అతడి రెండో భార్య బావికాడి నివాసం నుంచి కనబడకుండా ఎందుకు వెళ్లిపోయిందో తెలియాలంటే కథ చదవాల్సిందే.

అంతరిక్ష యాత్రికుని మనసులో ఏముందో ఏ అంతరంగానికి తెలుస్తుంది. ముక్కోణపు ప్రేమలో మిగిలేవి రెండే. మరొకటి అంతర్ధానమే. స్వార్థం రగిలించిన ప్రేమ కోసం అంతరిక్షంలో చేసిన అఘాయిత్యమే 'ఎల్లలు' కథలో గెలిచింది ప్రేమనా? స్వార్థమా చదివితే గానీ బోధపడదు.

బతుకమ్మ పండుగకు తల్లి గారి ఇంటికి వచ్చిన బాల్య మిత్రురాలు వినోదా, సరోజ సుమతులు. ఇరువై వేలు సంపాదించినా అప్పుల పాలవుతున్న సరోజ ఆగమ్య గోచర స్థితిని సుమతికి వినోద చెప్పిన పొదుపు రహస్యం తెలియాలంటే ఇగరం ఉండాలని చెప్పే 'ఇగురం' కథ బతుకమ్మాటలా ప్రేరేపిస్తుంది.

సమూహంలోంచి వెలివేయబడితే ఒంటరితనమని, సమూహాన్ని వెలివేస్తే ఏకాంతం అని రచయిత నిర్వచించాడు. ఒంటరితనానికి ఏకాంతానికి మధ్య నిట్టూర్పే మానవ జీవితం. ఒంటరితనం ఓటమివైపు, ఏకాంతము గెలుపుకు బాటలేస్తాయనీ, ఒంటరితనంలో సమాజం కోసం రచయిత లోలోన కుమిలిపోయే వ్యవస్థను చూసిన మనస్సుకు బతికినన్నాళ్లు ఈ బాధ తప్పదని ఉదాసీనంగా వెళ్లిపోవడమే ఏకాంతం కలిగించే జాలి అనీ డిస్ట్రాక్టివ్గా చెప్పే అబ్స్ట్రాక్టివ్ కథ 'ఒంటరి ఏకాంతం' చదివితే ఎన్నో విషయాలు, విశేషాలు విధితమవుతాయి.

ఊరిలో మనుషుల మధ్య సంబంధం కలిపేది వృత్తి పని. వృత్తి పనివాళ్లను కలిపే వేదిక పంట పండాక ధాన్యం కొలిచే కల్లం. పనిచేయనోళ్లకు మన దాన్నెం పంచిపెట్టుడెందుకు తాతా అని అడిగినప్పుడు కడుపులో చేయి పెట్టి దేవి తీసిన సమాధానం తాత చెప్తూ "ఆళ్ళందరూ పరాయోళ్ళు కాదురా! కులాలు వేరైనా మనందరం ఒకటే. మనకు భూముంది. సేద్యం చేస్తం. గది మన వృత్తి. కమ్మరి కుమ్మర్లందరూ మన కోసం పని చేస్తరు. మనం వాళ్ల కోసం పని చేయాలి. ఎవ్వలి పని ఆదే చేసుకుంటే మందితోటేం పని?" అని ఏకత్వం మర్మం చెప్పే 'బర్కత్' కథ మనుషులంతా ఒక్కటనే నిజం కడుపుల ఆత్మ కండ్లకు దుఃఖం తెస్తది.

నాయకుడిగా ఎదగాలనుకుంటే మనొక్కరమే ఎదుగుతాం. నాయకులు తయారు చేయగలిగిన వాడే మహానాయకుడు అని పేర్కొన్న ఒక జింక నాయకత్వం వహిస్తూ జింకల గుంపును, కుర్ర మమ్సజింకను కాపాడుతూ పులిని చంపేస్తూ తను చనిపోతూ పదుగురికి చావు మేలు గొప్పదనీ జింక చేసిన త్యాగమే 'యుద్ధం' కథ. ఈ కథలో జింకలు మానవులకు ప్రతీకలు. ఈ కథలో మానవ సమూహాన్ని ఎలా కాపాడాలో బోధించే సందేశమూ ఉంది.

ఎత ఎత్తిపోస్తూ
జీవితంలో సంపాదనే ముఖ్యం కాదు బిడ్డా అని "పానంతోటి బతకాలంటే ఊర్లలో బతకాలె"నని ఊరిలోని మానవీయ మమతలను అందించే గొప్ప సందేశం 'రెండో మీ!ఉత్తరం' కథ ప్రతీకాత్మక భవిష్యత్తు సందేశాన్ని తండ్రి ద్వారా కొడుకు అందిస్తుంది.

తెరచిన కిటికీలోంచి ప్రకృతిని చూసినప్పుడు అనేక దృశ్యాలు కనబడుతుంటాయి. బాల్యమిత్రుడు చనిపోవడం గుర్తు తెచ్చుకొని మనసు వికలమవుతూనే ఉంటుంది. ఎంసెట్ మెడికల్ సీట్ సంపాదించిన కొడుకు బిఎస్సి అగ్రికల్చర్ వైపు వెళ్తాననడం. కిటికీ దృశ్యాలతో ఆలోచనలు ఆచరణలు మూలాల్లోకి వెళ్లడం కోసం మమేకం చేసే కథ 'తెరిచిన కిటికీ.'

అనువణువునా పల్లె తనం నింపుకున్న మనిషి జీవన విధానమే ఇగురంగల్లోడు కథ. ఎవరికి అర్థం కాదు. కడుపు నిండా కనబడని ప్రేమ, కనిపించే శత్రువుగానే ఉన్నా కుటుంబం పట్ల ఉదాసీనతలేదు. ఉ ల్లాసము నింపని వ్యక్తి పట్ల కుటుంబ సభ్యుల అనుబంధాల అల్లికే ఈ కథ.

ఊరు దాటకున్నా సరే వ్యవసాయ దంపతుల అన్యోన్యతలు ఎలా రెట్టింపు చేస్తూ బావిని హనీమూన్ గా భావిస్తూ, పొలాన్ని ఫారిన్ ట్రిప్ గా చిత్రిస్తూ జీవిత యాత్ర కొనసాగించాలనే సందేశాత్మకమైన కథ 'యాత్ర'. ఏ విధం ఏవీ లేవని బాధపడటం కంటే ఉ న్న వాటితో తృప్తి పడటం జీవితానికి అంతకంటే మించిన సంతోషం లేదని ఆలుమగలు అరమరికల్లేకుండా ఎలా జీవించాలో తెలియజేసే కథ యాత్ర. నవల లాంటి వర్ణనలా సాగింది.

Published in May /2024 namaste telangana chelime